# రెవెన్యూ అధికారులకు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నేరడిగొండ మండల రెవెన్యూ కార్యాలయానికి ఇటీవల నూతనంగా బదిలీపై వచ్చిన ఆర్ఐలు సాయిరాం, మమత, సీనియర్ అసిస్టెంట్ యాస్మిన్లను లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ బుధవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజ ప్రక్రియేనని, అయితే ప్రజాసేవలో చూపే అంకితభావం, కృషి అధికారులకు ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తాయని అన్నారు. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే అధికారుల సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.మండల అభివృద్ధి కోసం ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేసే అధికారులకు ప్రజాప్రతినిధులుగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జైనూర్ ఏఎస్సై ముండే ఉద్ధవ్ బదిలీ

**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ముండే ఉద్ధవ్ను తిర్యాణి పోలీస్ స్టేషన్కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త పోస్టింగ్లో వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. బదిలీ సందర్భంగా జైనూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు ముండే ఉద్ధవ్కు ఘనంగా సన్మానం నిర్వహించారు. శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ జైనూర్లో విధులు నిర్వహించిన కాలంలో ముండే ఉద్ధవ్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదుదారుల సమస్యలను సకాలంలో పరిష్కరించారని కొనియాడారు. ఆయన సేవా తత్వం, క్రమశిక్షణ, విధి నిర్వహణ అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. తిర్యాణి పోలీస్ స్టేషన్లోనూ అదే నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన బాలికల హాస్టల్లో కొండచిలువ కలకలం

**అటవీ శాఖ చాకచక్యంతో 12 అడుగుల కొండచిలువ పట్టివేత**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని గిరిజన బాలికల హాస్టల్లో 12 అడుగుల పొడవైన కొండచిలువ ప్రత్యక్షమవడంతో విద్యార్థినులు, హాస్టల్ సిబ్బంది తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సోమవారం జరిగిన ఈ ఘటనతో హాస్టల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఈడీ పరీక్షలు రాసేందుకు హాస్టల్కు వచ్చిన విద్యార్థినులు కొండచిలువను గమనించగానే భయంతో పరుగులు తీశారు. వెంటనే హాస్టల్ వార్డెన్ అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు హాస్టల్కు చేరుకుని ప్రత్యేక జాగ్రత్తలతో కొండచిలువను సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం దానిని హాస్టల్ పరిసర ప్రాంతం నుంచి బయటకు తీసుకెళ్లి సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. అటవీ శాఖ అధికారులు సకాలంలో స్పందించి కొండచిలువను పట్టుకోవడంతో విద్యార్థినులు, హాస్టల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులకు ధైర్యం చెబుతూ అడవి జంతువులు, పాములు కనిపించినప్పుడు భయపడకుండా వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం అందించాలని సూచించారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సిరిసిల్ల అటవీ క్షేత్రాధికారి జి.నాగేశ్వరరావు అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలో పర్యావరణ చట్టాలు, వన్యప్రాణుల సంరక్షణ, అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని వివరించారు. అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ మల్లుగారి పద్మ, అటవీ శాఖ సిబ్బంది కలిసి మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ అటవీ క్షేత్రాధికారి ఖలీలుద్దీన్, రెండు రేంజ్ల అటవీ శాఖ సిబ్బంది, గంభీరావుపేట గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- జిల్లా ఎస్పీ నితికా పంత్
- పోలీసుల 'ఫుట్ పెట్రోలింగ్'
- హెల్మెట్ ధరించిన వారికి "బెస్ట్ సిటిజన్స్ ఇన్ ఆసిఫాబాద్"గా అభినందనలు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవ డిజిపి సివి ఆనంద్ ఆదేశాల మేరకు, జిల్లా ప్రజల భద్రత శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో పోలీసులు భారీ 'ఫుట్ పెట్రోలింగ్' నిర్వహించారు. కంచుకోట, గాంధీ చౌక్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, పైకాజీ నగర్ మీదుగా ప్రధాన రహదారి వరకు ఎస్పీ నితికా పంత్, ఆసిఫాబాద్ డివిజన్ పోలీసులతో కలిసి నడుస్తూ భద్రతా పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ వాహనదారులను ఆపి హెల్మెట్ ప్రాధాన్యతను వివరించారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం కలగడమే కాకుండా, వారి కుటుంబ సభ్యులకు తీరని నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కాగా, రోడ్డుపై హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న పలువురు వాహనదారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ, వారిని "బెస్ట్ సిటిజన్స్ ఇన్ ఆసిఫాబాద్" గా కొనియాడారు.ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు జిల్లాలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలోని అన్ని సీఐ, డీఎస్పీ, ఏఎస్పీ కార్యాలయాల్లో ప్రతిరోజు మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు సంబంధిత ఉన్నతాధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు నేరుగా కార్యాలయాలకు వెళ్లి తమ ఫిర్యాదులను, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని, వాటి త్వరితగతిన పరిష్కారానికి ఈ ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, టౌన్ ఇన్స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, ఇన్స్పెక్టర్లు రమేష్, వేణుగోపాల్, సబ్ ఇన్స్పెక్టర్లు మధుకర్, రవికుమార్, విక్రమ్, మహేందర్, ఉల్లాస్, శ్యామ్ రామ్, మోహన్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



# 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఈ నెల 5వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 5వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఆసిఫాబాద్ లో 1, కాగజ్ నగర్ లో 1, సిర్పూర్ (టి) లో 1 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షలకు 530 మంది విద్యార్థులు విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని, పారిశుద్ధ్య, త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సిబ్బంది, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులు పరీక్షల సమయానికి చేరుకునేలా ఆర్ టి సి అధికారులు బస్సులు నడపాలని, పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాలని తెలిపారు. పరీక్ష సమయం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందని, అధికారులు సమన్వయంతో పని చేసి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ క్రికెట్ లీగ్‌కు ఆసిఫాబాద్ గిరిజన యువకుడు 'శ్రీ చంద్ నాయక్' ఎంపిక

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :**

మారుమూల గ్రామానికి చెందిన ఒక గిరిజన యువకుడు తన అద్భుత ప్రతిభతో జాతీయ స్థాయికి ఎంపికై జిల్లా ఖ్యాతిని చాటాడు. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన బాదావత్ శ్రీ చంద్ నాయక్ ప్రతిష్టాత్మక నేషనల్ క్రికెట్ లీగ్ కు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లోని సెంచూరియన్ మైదానంలో అండర్-16 క్రికెట్ క్రీడాకారుల కోసం మూడు రోజుల పాటు కఠినమైన సెలక్షన్ పోటీలను నిర్వహించారు. ఈ ఎంపిక పోటీల్లో తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుండి వందలాది మంది యువ క్రికెటర్లు పాల్గొ న్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్న ఈ సెలక్షన్స్‌లో శ్రీ చంద్ నాయక్ బౌలింగ్, బ్యాటింగ్ విభాగాలలో అద్భుతమైన ప్రతిభను కనబరిచి సెలక్టర్ల మనసు గెలుచుకున్నారు. తన అత్యుత్తమ ఆటతీరుతో జాతీయ లీగ్‌లో ఆడేందుకు తుది జట్టులో స్థానాన్ని సంపాదించుకున్నారు. శ్రీ చంద్ నాయక్ స్థానిక బాబాపూర్ గ్రామానికి చెందిన బాదావత్ శివప్రసాద్ – రజిత దంపతుల చిన్న కుమారుడు. తమ కుమారుడు జాతీయ స్థాయి లీగ్‌కు ఎంపికయ్యాడనే వార్త తెలియడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనంద డోలికల్లో మునిగిపోయారు. చిన్నప్పటి నుండి క్రికెట్ పై ఉన్న ఇష్టమే ఈ రోజు శ్రీ చంద్ నాయక్‌ను ఈ స్థాయికి చేర్చిందని, తమ గ్రామం నుండి నేషనల్ లీగ్‌కు ఎంపిక కావడం చాలా గర్వంగా ఉందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.శ్రీ చంద్ నాయక్ సాధించిన ఈ అరుదైన విజయంతో బాబాపూర్ గ్రామంతో పాటు ఆసిఫాబాద్ మండలంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన యువత, పెద్దలు ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులకు, శ్రీ చంద్ నాయక్‌కు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో శ్రీ చంద్ నాయక్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, క్రికెట్ రంగంలో రాణించి గ్రామానికి, జిల్లాకు అలాగే తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు ఆకాంక్షించారు.



# సమయపాలన తప్పనిసరి



- ప్రభుత్వ కార్యాలయాల తనిఖీలో కలెక్టర్ కె. హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను బుధవారం జిల్లా కలెక్టర్ కె. హరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా నీటి పారుదల కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయం, పంచాయతీ రాజ్ భవనాల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాలను సందర్శించి, సిబ్బంది హాజరు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడుతూ.. చెరువులు, కాలువల మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఆటంకం కలగకుండా సాగునీటిని అందించాలని ఆదేశించారు. కాలువలలో పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చూడాలన్నారు. అలాగే కాలువల తూముల మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలని, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో కార్యాలయాల సిబ్బంది, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎస్పీఎం కార్మిక సంఘం ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి

- 15వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు

**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్‌లో ఎస్పీఎం కార్మిక సంఘ ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 15వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి కార్మిక సంఘ ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేయాలని కోరారు. లేబర్ డిపార్ట్మెంట్ అధికారుల సమక్షంలో ఎస్పీఎం యాజమాన్యంతో చర్చలు నిర్వహించి, ప్రస్తుతం కోర్టులో ఉన్న పిటిషన్‌ను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘ ఎన్నికల ప్రక్రియను వెంటనే ప్రారంభించి కార్మికుల ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని కోరారు. ఎన్నికల నిర్వహణ విషయంలో ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తే రిలే నిరాహార దీక్షలతో పాటు మరింత తీవ్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ దీక్షా కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోలేం వెంకటేష్, గోగర్ల రాములు, వల్లాల సుభాష్, సి.వెంకటేష్, చిట్టవేణి రాజేష్, నానాజీ, తాటి వెంకటేశ్, తన్నీరు పోషం తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణకు సైక్లింగ్ ఎంతో దోహదం

- **అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో "శూన్య ఇంధనం – గరిష్ట ఆరోగ్యం" నినాదంతో భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, ఇంధన పొదుపుకు సైకిల్ వినియోగం ఉత్తమ మార్గమని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడానికి ప్రతిఒక్కరూ సైక్లింగ్ను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. రోజువారీ సైక్లింగ్ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో, ఒత్తిడిని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పర్యావరణ వారోత్సవాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 7న '5కే రన్' నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ పోటీల్లో విజేతలకు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మానవహారం నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై నినాదాలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ శ్రీనివాస్, ఎఫ్డీఓ అరవింద్ కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి అవినాష్, అటవీ శాఖ సిబ్బంది, క్రీడాకారులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెలు లేని తెలంగాణ నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4 నుంచి 12 వరకు నిర్వహించనున్న గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి లోపాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణం లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. జనగణన, భూభారతి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యత్వంపై కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా లైఫ్టైమ్ మెంబర్షిప్ తీసుకునేలా అధికారులు చొరవ చూపాలని పేర్కొన్నారు. రాబోయే వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను అప్రమత్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి విరిగిన స్తంభాలు, ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను వెంటనే సరిచేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యా శాఖకు సంబంధించి పాఠశాలల పునఃప్రారంభోత్సవం సందర్భంగా చేపట్టే "బడిబాట" కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈఓ రవి, డీఆర్డీఓ రవీందర్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, డీపీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రైల్వే భూమి స్వాధీనం.. భారీ బందోబస్తు మధ్య హద్దుల తొలగింపు

**జేసీబీలతో కట్టడాల కూల్చివేత**




**ఉద్యమ కెరటం, తాండూర్:** మండల కేంద్రంలోని రేచిని రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే భూమిని బుధవారం రైల్వే అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య చేపట్టిన ఈ చర్యలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. తెల్లవారుజామున బెల్లంపల్లిరైల్వే ఇంజనీరింగ్ శాఖ అధికారులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్), సివిల్ పోలీసులు, రైల్వే సిబ్బంది పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైల్వే శాఖకు, ఓ ప్రైవేటు సంస్థకు మధ్య వివాదాస్పదంగా ఉన్న భూమి చుట్టూ ఉన్న హద్దులను తొలగించి, ఆ స్థలంలోని నిర్మాణాలను జేసీబీల సహాయంతో కూల్చివేశారు. నేషనల్ హైవేకు ఆనుకుని నిర్మాణంలో ఉన్న ఒక కట్టడాన్ని కూడా అధికారులు తొలగించారు. సుమారు నాలుగు గంటల పాటు కొనసాగిన ఈ కార్యక్రమాన్ని చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఈ ఘటనపై బెల్లంపల్లిరైల్వే ఇంజనీరింగ్ శాఖకు చెందిన ఓ అధికారి మాట్లాడుతూ రైల్వే ఆస్తులను పరిరక్షించడం శాఖ నిత్య విధుల్లో భాగమని తెలిపారు. గతంలో ఈ భూమికి సంబంధించి కోర్టు స్టే ఉన్నప్పటికీ ప్రస్తుతం అది తొలగిపోయిందని, కోర్టు ఆదేశాల మేరకే భూమిని రైల్వే శాఖ స్వాధీనం చేసుకుందని వివరించారు. ఇందులో ప్రత్యేకత ఏమీ లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రైల్వే ఇంజనీరింగ్ శాఖ అధికారులు, తాండూర్ సీఐ దేవయ్య, తాండూర్ ఎస్సై ప్రసాదరావు, తాళ్లగురజాల ఎస్సై రామకృష్ణ, రైల్వే సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పోడు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం

- **అటవీ హక్కుల కల్పనకు కృషి చేస్తాం : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన పోడు రైతులు ఎదుర్కొంటున్న భూ హక్కులు, అటవీ భూముల సాగు, ఇతర సంబంధిత సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బుధవారం హైదరాబాద్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన పోడు రైతులు, కౌలు రైతులు పాల్గొని తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యలను ఓపికగా విన్న ఆయన, వాటి పరిష్కారం కోసం అటవీ శాఖ ఉన్నతాధికారులతో నేరుగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పోడు రైతుకు అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కులు కల్పించాలని, భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల జీవనోపాధికి సంబంధించిన ఈ కీలక అంశంపై నిరంతరం పోరాడుతూ వారి తరపున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. పోడు రైతుల హక్కుల సాధన, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో కృషి కొనసాగిస్తామని తెలిపారు.

# ఘనంగా హరీశ్ రావు జన్మదిన వేడుకలు





- **దౌల్తాబాద్ చౌరస్తాలో కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ శ్రేణులు**

**ఉద్యమ కెరటం, హత్నూర:** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు జన్మదిన వేడుకలను బుధవారం హత్నూర మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దౌల్తాబాద్ చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి హరీశ్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ హరీశ్ రావు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత సమర్థవంతమైన నాయకుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యలపై అదే నిబద్ధతతో స్పందిస్తూ నిరంతరం ప్రజల కోసం పనిచేసే నాయకుడు హరీశ్ రావు అని పేర్కొన్నారు. ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని, పనితీరును మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా పలుమార్లు ప్రశంసించారని గుర్తుచేశారు. హరీశ్ రావు సంపూర్ణ ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని, ప్రజల ఆశీస్సులతో ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామచంద్రారెడ్డి, శివశంకర్ రావు, నరసింహారెడ్డి, వావిలాల నరసింహులు, అంబటి అర్జున్, కృష్ణ, ఆగమయ్య, మల్లేష్, మచ్చ నరేందర్, మాణిక్యరెడ్డి, మధు, కిషోర్, శేఖర్, అజ్జు, శంకర్, సురేందర్ రెడ్డి, రాజు, మాజీ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో మంగళవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా మండుతున్న ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కల్లూరు మండలం పోచారం గ్రామంలో ఓ ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు పూర్తిగా దగ్ధమైంది. ఘటన సమయంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊరట చెందారు. అయితే పిడుగు ప్రభావంతో చెట్టు కాలిపోవడం గ్రామస్తులను ఆందోళనకు గురిచేసింది. వర్షం, ఈదురు గాలుల ప్రభావంతో కల్లూరు, పెనుబల్లి మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో స్వల్ప విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు కొంతసేపు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న రోజుల్లో కూడా జిల్లాలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# పరమేశ్వర్ కోలేట్కర్కు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ విభాగం నూతన చైర్మన్గా నియమితులైన పరమేశ్వర్ కోలేట్కర్ను బుధవారం భారతీయ బౌద్ధ మహాసభ, పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక కైలాస్నగర్లోని అశోక బుద్ధ విహార్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాజాడే ప్రజ్ఞ కుమార్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధనతో పాటు దళితుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి పరమేశ్వర్ కోలేట్కర్ కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం పరమేశ్వర్ కోలేట్కర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. ఎస్సీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు సోగల సుదర్శన్, విఠల్, దయానంద్, హుకే దైవశాల, రాజు మస్కే, రాజు పటోడే, ఉదయ్ రత్నాజాడే తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో పారదర్శకంగా ఈ-బైకుల లక్కీ డ్రా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మైనార్టీలకు మంజూరయ్యే ఈ–బైకుల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఆదిలాబాద్ పురపాలక సంఘంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీ, స్థానిక కౌన్సిలర్ల సమక్షంలో ఈ–బైకుల లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంలోని 49 వార్డుల నుంచి మొత్తం 747 దరఖాస్తులు అందాయని తెలిపారు. వాటిలో నిబంధనలకు అనుగుణంగా లేని 65 దరఖాస్తులను తిరస్కరించగా, మిగిలిన 682 అర్హత కలిగిన దరఖాస్తుదారుల నుంచి నియోజకవర్గ కోటా కింద 27 మందిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించామని, మీడియా ప్రతినిధులు, కౌన్సిలర్ల సమక్షంలో పూర్తి వీడియోగ్రఫీతో లక్కీ డ్రా చేపట్టినట్లు తెలిపారు. లక్కీడ్రాలో ఎంపికైన లబ్ధిదారుల పూర్తి జాబితాను గురువారం మున్సిపల్ కార్యాలయ నోటీస్ బోర్డుపై ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియపై ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని, ఈ–బైకులు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నమ్మవద్దని హెచ్చరించారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతుందని, ఎవరికీ ఒక్కరూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ, మున్సిపల్ కౌన్సిలర్లు, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# ఘనంగా జన భవిత చారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలు

- **భగవద్గీత మహాయజ్ఞం, మృత్యుంజయ హోమం నిర్వహణ**




**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కౌటాల మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగ ధ్యాన శిక్షణ కేంద్రం వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. యోగ సాధకులు, ట్రస్ట్ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌటాల గ్రామ ప్రజల క్షేమం, శాంతి, సౌభాగ్యం కోసం భగవద్గీత మహాయజ్ఞం నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. యోగ సాధనలో పాల్గొనే వారందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ప్రార్థించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ జాడే కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం, ముఖ్యంగా వారి కుమార్తె ఆరోగ్యం మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ మృత్యుంజయ హోమం నిర్వహించారు. అనంతరం యోగ గురువులు, యోగ సాధకులు యోగ ప్రాముఖ్యతను వివరించి తమ అనుభవాలను పంచుకున్నారు. యోగ ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షులు డోంగ్రే సురేష్ మాట్లాడుతూ గత ఏడాది నుంచి ఒక్కరోజు కూడా విరామం లేకుండా యోగ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. యోగ శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న యోగ గురువులు దాసరి వినోద్ కుమార్, దౌలత్ సార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్య, ఆరోగ్యం, ఆర్థిక సాధికారత రంగాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యోగ శిక్షణతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, పోటీ పరీక్షల కోచింగ్, ఉచిత వైద్య శిబిరాలు, పాఠశాలలు, కళాశాలల్లో మోటివేషనల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ జాడే ఆశయాలను సాకారం చేసేందుకు సభ్యులంతా సేవా కార్యక్రమాల్లో నిరంతరం ముందుండి పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రమేష్ హాజరై ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అయ్యగార్లు, యోగ గురువులు, యోగ సాధకులు, ట్రస్ట్ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.




# రైల్వే అధికారుల తీరు ఆక్షేపణీయం

- **కోర్టు పరిధిలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవడం సరికాదు**
- **అడ్వకేట్ ఉదయ్ కిరణ్**
- **హద్దుల తొలగింపుపై కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి**




**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ శివారులోని రేచిని రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో స్టీపిల్ ఇన్ఫ్రా కేర్ ప్రైవేట్ లిమిటెడ్కు చెందిన భూమిపై రైల్వే అధికారులు చేపట్టిన చర్యలు తీవ్ర ఆక్షేపణీయమని ఆ సంస్థ తరఫు న్యాయవాది ఉదయ్ కిరణ్ ఆరోపించారు. బుధవారం తాండూర్ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ మేనేజర్ కిషోర్ గౌడ్తో కలిసి మాట్లాడారు. స్టీపిల్ ఇన్ఫ్రా కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 2021లో ఈ భూమిని కొనుగోలు చేసిందని, రెవెన్యూ రికార్డులు, సర్వే హద్దులు, ఇతర ఆధారాల ప్రకారం భూమిపై సంస్థకు పూర్తి హక్కులు ఉన్నాయని తెలిపారు. ఈ భూమికి సంబంధించి గతంలో రైల్వే అధికారులు జారీ చేసిన నోటీసులకు సంస్థ తరఫున సమగ్ర సమాధానం ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం కోర్టు ద్వారా కూడా తమ వాదనలు సమర్పించామని తెలిపారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టు పరిధిలో ఉందని, ఈనెల 4న మరోసారి విచారణ జరగాల్సి ఉందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి తాజా కోర్టు ఉత్తర్వులు లేకుండానే రైల్వే అధికారులు దౌర్జన్యంగా భూ హద్దులను తొలగించడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. రైల్వే శాఖ వద్ద తమ వాదనలకు సంబంధించిన ఆధారాలు ఉంటే వాటిని కోర్టులో సమర్పించాల్సిందే తప్పా ఏకపక్షంగా చర్యలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. సంస్థకు చెందిన భూ హద్దులు, నిర్మాణాలను తొలగించిన ఘటనపై కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు. అలాగే బెల్లంపల్లి రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది, ఇతర సంబంధిత అధికారులపై తాండూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. తదుపరి కోర్టు ఉత్తర్వులు వెలువడే వరకు భూమికి సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టినా చట్టపరంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ రాజ్య స్థాపన

- **నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతోంది**
- **డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం స్థాపన దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, నిరుపేదల సొంతింటి కల నిజమవుతోందని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా క్రాసోడ్డు వద్ద నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికిన సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు కీలక అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందనే నమ్మకం ముఖ్యమంత్రి పర్యటనతో మరింత బలపడిందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ కావడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ధనసరి సీతక్క, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తదితరులు పాల్గొన్నారు.



# సర్క్యులర్ను రద్దు చేయాలి

- **సత్తుపల్లి సీడీపీఓకు సీఐటీయూ నాయకుల వినతి**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి** అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు అన్యాయం చేసే విధంగా తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఆర్సీ నం. 830284 (2102) సర్క్యులర్ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సత్తుపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ సత్యవతికి భోజన విరామ సమయంలో వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ నుంచి బదిలీపై ఇటీవల సత్తుపల్లికి వచ్చిన నూతన సీడీపీఓ సత్యవతిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 2,769 ప్రీ–ప్రైమరీ కేంద్రాలను అంగన్వాడీలకు అప్పగించాలని, పీఎం శ్రీ విద్యా కార్యక్రమాన్ని అంగన్వాడీల ద్వారా అమలు చేయాలని, విద్యాబోధన బాధ్యతలను అంగన్వాడీ సిబ్బందికే అప్పగించాలని కోరారు. అలాగే విద్యా వాలంటీర్లకు చెల్లిస్తున్న వేతనాన్ని అంగన్వాడీ సిబ్బందికి కూడా అందించాలని, ఐసీడీఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రాంతాల్లో హెల్పర్లకు, టీచర్లుగా పదోన్నతులు కల్పించే విషయంలో "వార్డు పరిధి" నిబంధనను తొలగించి "పట్టణ పరిధి"గా మార్చాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లలోపు చిన్నారులను ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చేర్చకుండా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 15వేల అంగన్వాడీ పోస్టులను ఒకే దఫాలో భర్తీ చేయాలన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు పదవీ విరమణ పొందిన అంగన్వాడీ సిబ్బందికి పెండింగ్లో ఉన్న ఆర్థిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకే ఈ వినతిపత్రాన్ని సమర్పించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుశీల, కార్యదర్శి సకీనా, నాగేంద్ర, జీవమ్మ, రామేశ్వరి, విజయలక్ష్మి , మంగ తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండల కేంద్రంలోని ఐబీ ప్రాంతంలో ఉన్న విత్తనాల దుకాణాలను బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు విత్తనాల బ్యాగులను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు, నిల్వ విధానాలు, లేబులింగ్ వివరాలను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. వ్యవసాయ సీజన్ నేపథ్యంలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ తనిఖీలలో బెల్లంపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజు నరేందర్, తాండూర్ మండల వ్యవసాయాధికారి కె.సుష్మ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అడవులను కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత

## డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గౌరీశంకర్




**ఉద్యమ కెరటం, తాండూర్:** అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని మాదారం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.గౌరీశంకర్ అన్నారు. బెల్లంపల్లి అటవీ క్షేత్రాధికారి సీహెచ్.పూర్ణచందర్ ఆదేశాల మేరకు బుధవారం మాదారం–3 ఇంక్లైన్ గ్రామపంచాయతీ కార్యాలయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్ల ప్రాముఖ్యత, వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ శాఖ చేపడుతున్న చర్యలను గ్రామ ప్రజలకు వివరించారు. అడవులు, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి పౌరుడు బాధ్యతగా భావించాలని సూచించారు. "మనం అడవులను కాపాడితే అవి మనల్ని కాపాడతాయని పేర్కొన్నారు. అనంతరం అటవీ శాఖ అధికారులు, గ్రామస్థులు కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అడవుల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ సమతుల్యతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాదారం–3 ఇంక్లైన్ సర్పంచ్ చందనాల రవికుమార్, ఎఫ్బీఓ ఎం.రాజమణి, ఎఫ్బీఓ గోపీకృష్ణ, అనిమల్ ట్రాకర్ సమ్మయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన దుగ్గినేని రావమ్మ దశదినకర్మ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన మేడా వెంకయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే గ్రామానికి చెందిన లింగం నరసింహారావు రోడ్డు ప్రమాదంలో మరణించగా, వారి కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కష్టకాలంలో మనోధైర్యం కోల్పోకుండా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి , మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

